
సాక్షి
అనంతపురం

సోమవారం । 22 । మే । 2023



ఇది పాలేగాళ్ల అడ్డా
శతాబ్దాల నాటి రాచరిక చరిత్రకు ఆనవాళ్లుగా జిల్లాలో నేటికీ ఎన్నో సాక్ష్యాలు సజీవంగా కనిపిస్తున్నాయి. ఇందులో అరుదైన దుర్గంగా ఖ్యాతి గడించింది కునుమగిరి!
8లో



హెచ్ఐవీ బాధితులపై వివక్ష వద్దు
హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకుండా సంఘంలో ఒకరిగా కలుపుకోవాలని ప్రజలకు డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి పిలుపునిచ్చారు.
8లో

గరిష్టం/కనిష్టం
41.9°/24.6°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. వడగాల్పుల తీవ్రత కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోళ్లు



అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటా రూ.1,962 ప్రకారం రబీలో రైతులు పండించిన మొక్కజొన్న కొనుగోలు కార్యక్రమం కొనసాగుతోందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. 10 మండలాలు, 36 ఆర్‌బీకేల పరిధిలో 21 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. గత రబీలో 12,053 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారని పేర్కొన్నారు. 1,000 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా... ఇప్పటి వరకు రూ.98.10 లక్షలు విలువ చేసే 500 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. 712 మంది రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు.

పాడి రైతులకు ఊరట

- అమల్లోకి వైఎస్సార్ పశుబీమా పథకం



అనంతపురం అగ్రికల్చర్: పాడి రైతులకు ఊరట కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కొత్తగా 'వైఎస్సార్ పశుబీమా పథకం' అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు బీమా నిబంధనలు, ఇతరత్రా మార్గదర్శకాలు జారీ చేస్తూ జీఓ నంబరు 03 విడుదల చేసినట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు అమలు చేస్తున్న 'వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం'లో స్వల్పంగా మార్పులు చేర్పులు చేస్తూ ఇందులో పాడి రైతుల వాటా కూడా చేర్చినట్లు చెబుతున్నారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకం కింద లైవ్‌స్టాక్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలుల్లోకి తెస్తున్నట్లు సమాచారం. పాడి పశువు చనిపోయిన 15 రోజుల్లోపే నష్టపోయిన రైతుకు పరిహారం వర్తించేలా నిబంధనలు రూపొందించినట్లు చెబుతున్నారు. బీమా చేసుకున్న పాడి పశువు, గేదెలతో పాటు గొర్రెలు, మేకలకు కూడా పథకం ద్వారా పరిహారం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఈనెలలోనే ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తెస్తున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

పూర్వ విద్యార్థుల చేయూతపై పీర్ కమిటీ సంతృప్తి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల పురోగతికి పూర్వ విద్యార్థుల (అలుమ్ని) చేయూతపై ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన తెలిపారు. జేఎన్‌టీయూ అనంతపురం ఉద్యోగులతో వీసీ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎన్‌బీఏ పీర్ కమిటీ ఎగ్జిట్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించిందని, ఇందులో భాగంగానే పలు సూచనలు, సలహాలిచ్చినట్లు వీసీ పేర్కొన్నారు. ముఖ్యంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లపై ఎన్‌బీఏ కమిటీ సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు క్యాంపస్ ఇంటర్వ్యూల నిర్వహణపై ప్రశంసించినట్లు తెలియజేశారు. ప్రతి విభాగాన్ని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌పై అధ్యాపకులకు మరింత తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్,. కళాశాల ప్రిన్సిపాల్ పి. సుజాత, కలికిరి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవం

అనంతపురం క్రైం: ఏపీ సచివాలయ అనంతపురం జిల్లా ఉద్యోగుల సంఘం (384/2022) జిల్లా అధ్యక్షుడిగా యు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా డి.నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ వేదికగా జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారిగా ఆర్ మహేష్‌నాయక్, కార్యనిర్వహణ కార్యదర్శిగా పీహెచ్ మంజునాథ్, తదితరులు నియమితులయ్యారు.

హార్ట్ ఎటాక్



సత్యసాయి జిల్లా పెనుకొండకు చెందిన సందీప్ అనే యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు సరిగ్గా 34 ఏళ్లు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గుండెపోటుతో మృతిచెందారు. పెళ్లయి ఐదేళ్లే అయింది. మూడేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. దీంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండలానికి చెందిన ఓ యువకుడికి నిండా నలభై కూడా నిండకముందే గుండెపోటుతో కుప్పలికూలిపోయారు. గంటలోపే అనంత సర్వజనాస్పత్రికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోయింది.

గుండెపోటు...
ఒకప్పుడు అరవై ఏళ్లు దాటిన వారికి... అది కూడా తక్కువగా వచ్చేది. అయితే ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా అన్ని వయసుల వారికీ హార్ట్ ఎటాక్ వస్తోంది.

- నలభై ఏళ్లలోపు వయసులోనే గుండెపోటు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా నమోదవుతున్న కేసులు
- వ్యాయామాన్ని మరిచిపోవడంతో మరింత ముప్పు
- జీవనశైలి మార్చుకోవాలంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:
ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాజాగా చోటు చేసుకుంటున్న గుండెపోటు మృతుల్లో మెజారిటీ 40 ఏళ్లలోపు యువతీ యువకులే ఉన్నారు. మితిమీరిన ఒత్తిడి, వ్యాయామంపై కనీస అవగాహన లేకపోవడం, కొవ్వులు, నూనెలతో కూడిన తిండి వెరసి గుండెపోటును కొని తెచ్చుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు.


అధిక బరువుతోనే ...



ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఖర్చు చేస్తున్న సొమ్ములో మెజారిటీ సొమ్ము గుండెపోటు చికిత్సలకే అంటే ఆశ్చర్యమేమీ లేదు. 2019 నుంచి 2023 మార్చి వరకూ ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాకే రూ.101.63 కోట్లు వ్యయం చేశారంటే ఏ స్థాయిలో గుండెపోట్లు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ నాలుగేళ్లలో 24 వేల మందికి పైచిలుకు గుండెపోటు బాధితులు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సపొంది ప్రాణాలతో బయటపడ్డారు. జిల్లాలో విపరీత ఆహార పోకడల కారణంగా 70 శాతం మంది యువతీ యువకులు వయసుకు మించి బరువుతో ఉండటమే దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు.

నాలుగేళ్లలో ఆరోగ్యశ్రీ కింద ఖర్చు ఇలా..	
కేటగిరీ	వ్యయం (రూ.కోట్లలో)
గుండె చికిత్సలు	101.63
క్యాన్సర్	72.31
ఆర్థో-పాలీ ట్రామా	87.65
నార్మల్ డెలివరీ	13.85
సిజేరియన్ డెలివరీ	24.03

గుండెపోటు నుంచి గట్టెక్కాలంటే..



- వయసుతో పనిలేకుండా ప్రతిరోజూ 30 నిముషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి
- ఆహారంలో ఎక్కువగా కూరగాయలు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలి.
- కొవ్వు ఎక్కువగా ఉండే మాంసాహారాన్ని తక్కువగా తీసుకోవాలి.
- ఉప్పు, చక్కెర వంటివి తక్కువ మోతాదులో తీసుకోవాలి.
- రక్తపోటు నియంత్రణలో ఉందా? లేదా? అన్నది తరచూ చెక్‌చేసుకుని మందులు వాడాలి.
- అధిక బరువు లేకుండా సమతూకంలో ఉండేలా జాగ్రత్త పడాలి.
- 35 ఏళ్లు దాటిన వారు ఆరుమాసాలకోసారి రక్త పరీక్షలు చేయించి డాక్టర్‌ను సంప్రదించాలి.

వ్యాయామం లేకనే...



చాలా మంది వ్యాయామం మరిచిపోయారు. తినే ఆహారానికి వ్యాయామానికి పొంతన లేదు. అత్యధికంగా కార్బోహైడ్రేట్లున్న ఆహారం తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం గుండెపోటుకు ప్రధాన కారణం. కొన్నిసార్లు వారసత్వంగా కూడా గుండెపోట్లు వస్తున్నాయి. జీవనశైలిలో మార్పులు రాకపోతే ప్రమాదమే.
– డా.వంశీకృష్ణ, హృద్రోగ నిపుణులు

గాలీవాన బీభత్సం

- రాప్తాడులో రెండు కార్ల ఢీ. పలువురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కార్లు

రాప్తాడు: గాలీవాన బీభత్సం సృష్టించడంతో మండలంలోని మరూరు సమీపంలోని టోల్‌ప్లాజా దగ్గర బెంగళూరు వైపు వెళ్తున్న ఇన్నోవా కారు గాలీవానకు వాహనాన్ని అదుపు చేయలేక డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తెలంగాణకు చెందిన డ్రైవర్ గోపాలకృష్ణ, ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్న కర్ణాటకకు చెందిన మునిరాజ్, మంజునాథ్, హేమంత్ కుమార్, మను, గోపాల్, రత్న, గోపమ్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 ద్వారా పోలీసులు అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఆంజనేయులు ఆస్పత్రికి వెళ్లి బాధితుల వివరాలు తెలుసుకున్నారు.

పలు మండలాల్లో వర్షం
అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 15 మండలాల పరిధిలో 3.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. పామిడిలో 31.2 మి.మీ, గుత్తి 15.4 మి.మీ, ఆత్మకూరు 13.2 మి.మీ, వజ్రకరూరు 13 మి.మీ, బెలుగుప్ప 12.6 మి.మీతో పాటు రాయదుర్గం, కూడేరు, కుందుర్పి, కణేకల్లు, పెద్దవడుగూరు, కళ్యాణదుర్గం, విడపనకల్లు, గుంతకల్లు తదితర మండలాల్లో వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం కూడా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. మే నెల సాధారణ వర్షపాతం 36.7 మి.మీ కాగా 68 మి.మీ నమోదైంది. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఉష్ణోగ్రతలు, వేసవి తాపం కొనసాగుతుందని పేర్కొన్నారు.

బీటీపీ ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లు

- 157 రోజుల పాటు విజయవంతంగా నీటి తడులు
- ప్రభుత్వ విప్ కాపునకు కృతజ్ఞతలు తెలియజేసిన రైతులు



బీటీ ప్రాజెక్టు

రాయదుర్గం: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన భైరవాని తిప్ప (బీటీపీ) ప్రాజెక్టు నుంచి ఆయకట్టు పొలాలకు సమృద్ధిగా నీళ్లు అందించారు. గతేడాది డిసెంబర్ 27 నుంచి మే 21 వరకు సుమారు 157 రోజుల పాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కృషితో దిగ్విజయంగా సాగునీరు సరఫరా చేశారు. అధిక వర్షాల కారణంగా గతేడాది రిజర్వాయర్‌కు వరదనీరు పోటెత్తడంతో వరుసగా రెండోసారి రబీలోనూ సాగునీరు ఇచ్చారు. గుమ్మఘట్ట మండలంలోని ఎడమ కాలువ పరిధిలో 5400, బ్రహ్మసముద్రం మండలంలో కుడి కాలువ పరిధిలో 1950 ఎకరాల ఆయకట్టుకు నీటిని సర్దుబాటు చేశారు. అయితే ఆయకట్టుకు సాగునీటిని ఆదివారం నుంచి నిలిపేశామని ఇరిగేషన్ డీఈ వెంకటరమణ తెలిపారు.

విప్‌కు కృతజ్ఞతలు తెలిపిన రైతులు..
సకాలంలో కాలువకు మరమ్మతు చేయించి ఆయకట్టుకు సక్రమంగా నీరందించేలా కృషి చేసిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి జెడ్పీటీసీ పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. లస్కర్లు లేకున్నా కాపు చొరవతోనే సమృద్ధిగా ఆయకట్టు తడించిందని హర్షం వ్యక్తం చేశారు. నీటి తడులు సక్రమంగా అందడంతోనే నాణ్యమైన దిగుబడులు సాధ్యమయ్యాయని తెలియజేశారు.

మరో 9 అడుగులు వస్తే ..
బీటీపీ రిర్వాయర్‌లో ప్రస్తుతం 1646 అడుగుల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ పూర్తి నీటి సామర్థ్యం 1655 అడుగులు కావడంతో మరో 9 అడుగుల నీరు మాత్రమే అవసరం కానుంది. ఈ ఏడాది కూడా ముందస్తు వర్షాలు ఊరిస్తుండటంతో పూర్తిస్థాయికి నీరుచేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు, ఆయకట్టు రైతులు భావిస్తున్నారు. దీంతో ఖరీఫ్‌లోనూ ఆయకట్టు పొలాలకు నీటి తడులు అందే అవకాశం ఉందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ హయంలో ఐదేళ్లకోసారి కూడా ప్రాజెక్టు నిండే పరిస్థితి ఉండేది కాదని, జగనన్న సీఎం అయ్యాక కరువు పరిస్థితులు లేకుండా పోయాయని చెబుతున్నారు.

అర్హులకు ఇంటి స్థలం

- 90 రోజుల పథకం కింద ఇచ్చేందుకు చర్యలు
- జిల్లాలో 21,253 మంది అర్హుల గుర్తింపు
- పట్టాల మంజూరుకు ఏర్పాట్లు



గుమ్మఘట్ట మండలం కలగోడులో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

అనంతపురం అర్బన్: పేదలకు సొంతింటి కల నిజం చేయడంతో పాటు వారికంటూ స్థిరాస్తిని సమకూర్చే దిశగా జగన్ సర్కారు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో అర్హులకు ఇంటి స్థలం మంజూరు చేయడమే కాకుండా ఇంటి నిర్మాణం సైతం చేపడుతోంది. జిల్లావ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇప్పటికే ఇళ్ల నిర్మాణ ప్రక్రియ పెద్దఎత్తున నడుస్తోంది. అయినప్పటికీ కొన్ని చోట్ల కొందరు పేదలకు వివిధ కారణాలతో ఇంటి స్థలం మంజూరు కాలేదు. అలాంటి వారికోసం 90 రోజుల్లో ఇంటి స్థలం పథకాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అర్హులందరికీ ఇంటి స్థలం మంజూరు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు వేగవంతం చేసింది. ఈ పథకం కింద జిల్లావ్యాప్తంగా అందిన దరఖాస్తుల విచారణ పూర్తి చేసి 21,253 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి ఇంటి పట్టా ఇచ్చేందుకు ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నారు. స్థలాలు కేటాయించేందుకు అనుకూలంగా ఉండే ప్రభుత్వ భూమిని గుర్తించి వివరాలను పంపించాలని తహసీల్దార్లను జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశించారు.

భూ సమీకరణకు చర్యలు..
90 రోజుల పథకం కింద గుర్తించిన లబ్ధిదారులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వ భూమిని సమీకరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. నివాసయోగ్యమైన ప్రాంతంలో ప్రభుత్వ భూమిని సేకరించి ఇంటి స్థలం ఇవ్వడం, ఇప్పటికే వేసిన లే అవుట్లలో ఖాళీగా ఉన్న ప్లాట్లను కేటాయించడం, ఆక్రమణలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని వాటిలో పట్టాలు ఇవ్వడం వంటి వాటిపై అధికారులు దృష్టి పెట్టారు. గుర్తించిన అర్హులందరికీ పట్టాలిచ్చి..స్థలాలు కేటాయించే ప్రక్రియ వేగవంతంగా నడుస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు.

రెవెన్యూ డివిజన్ల వారీగా అర్హుల సంఖ్య	
డివిజన్	అర్హులు
అనంతపురం	12,402
గుంతకల్లు	6,213
కళ్యాణదుర్గం	2,638
మొత్తం	21,253

ప్రైవేటు టీచర్ల మెడపై అడ్మిషన్ల కత్తి

- అనంతపురం నగరంలోని పేరు గాంచిన ఓ కార్పొరేట్ కళాశాలలో పని చేస్తున్న ఓ అధ్యాపకుడు ఇటీవల లక్ష్మీనగర్‌లోని ఓ ఇంటికి వెళ్లాడు. ఆ ఇంటి అమ్మాయి పదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్‌కు తమ కళాశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించే ప్రయత్నం చేశాడు. కళాశాల, గ్రూపు నిర్ణయించుకోలేదని విద్యార్థిని, తల్లిదండ్రులు చెప్పారు. మీరు ఇప్పుడే సీటు బుక్ చేసుకుంటే ఫీజులో కూడా రాయితీ ఇప్పిస్తానంటూ ఎంతగానో బతిమాలారు.
- ఓ కార్పొరేట్ పాఠశాలలో పని చేస్తున్న క్లర్కు ఐదు రోజుల కిందట విద్యారణ్యనగర్‌లోని ఓ ఇంటికి వెళ్లాడు. మీ బాబు 6వ తరగతికి మా స్కూల్‌లో చేర్పిస్తే ఐఐటీ ఫౌండేషన్‌కు ఇప్పటి నుంచే పునాది వేస్తామని తల్లిదండ్రులకు తెలియజేశారు. ఇప్పుడే రిజర్వ్ చేసుకుంటే ఫీజులో కూడా రాయితీ ఇస్తామన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందికి ఇచ్చిన అడ్మిషన్ల టార్గెట్లకు ఇవి ముచ్చుతునక మాత్రమే.

- క్లర్కు నుంచి ప్రిన్సిపాల్ వరకు..
- టార్గెట్లు పెట్టి వేధిస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాలు
- ఆందోళన చెందుతున్న సిబ్బంది



రాప్తాడు రూరల్: కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది మెడపై 'అడ్మిషన్స్' అనే కత్తి వేలాడుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల్లో అడ్మిషన్లు చేయాలంటూ యాజమాన్యాలు తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నాయి. అడ్మిషన్ల సంఖ్యను బట్టే వచ్చే విద్యా సంవత్సరంలో జీతాల చెల్లింపు ఉంటుందని నిబంధన వారికి కంటినిండా కునుకు లేకుండా చేస్తోంది. స్కూళ్ల హెచ్‌ఎంలు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు కూడా ఇందులో మినహాయింపు లేదు. వారుకూడా తమ



లక్ష్యాన్ని చేరుకోవాల్సిందే.

మాటలతో మరింత...
ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలు పెట్టే నిబంధనలు భరించలేక, అలాగని బయటికి రాలేక సిబ్బంది సతమతమవుతున్నారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని యాజమాన్యాలు యాచకవృత్తిలా దిగజార్చుతున్నారంటూ ఓ కళాశాల ప్రిన్సిపాల్ వాపోయారు. టార్గెట్లు పెట్టి మానసిక క్షోభకు గురిచేస్తున్నారని, అంతటితో ఆగకుండా ఉదయం, సాయంత్రం సమావేశాలు నిర్వహించి వ్యక్తిగతంగా అమానుషమైన మాటలు అంటున్నారని కొందరు టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

28 వేల సిబ్బంది..
జిల్లా వ్యాప్తంగా జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో సుమారు 28 వేల మంది బోధన, బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా అనంతపురం నగరంతో పాటు తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం తదితర పట్టణాల్లో వారంతా ఇంటింటా తిరుగుతున్నారు. అంతటితో ఆగకుండా తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు తీసుకుని రోజూ నాలుగైదు సార్లు ఫోన్లు చేస్తున్నారు. తమకు టార్గెట్లు కూడా ఉన్నాయంటూ వేడుకుంటున్నారు.

వాహనాలతో ఎప్పుడూ కిటకిటలాడే సప్తగిరి సర్కిల్ నిర్మానుష్యంగా మారిన దృశ్యం



భానుడి భగ భగ

భానుడి భగ భగకు ప్రజలు అల్లాడిపోతున్నారు. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ఉదయం 10 తర్వాత ఎవరూ బయటకు రాలేని పరిస్థితి. విపరీతమైన ఉక్కపోతతో ఇళ్లల్లోనూ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆదివారం సెలవు రోజు కావడం, ఎండ కూడా తీవ్రంగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు కూడా జనంలేక వెలవెలబోయాయి.
– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం



ఎండ వేడిమిని తట్టుకోలేక చున్నీ కప్పుకుని వాహనంపై వెళ్తున్న మహిళలు

క్లుప్తంగా

పేద బ్రాహ్మణ విద్యార్థినులకు ఉచిత విద్య, వసతి

అనంతపురం కల్చరల్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో నిరుపేద బ్రాహ్మణ బాలికల ఉన్నత విద్యకు గ్లోబల్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ అసోసియేషన్ భరోసానిస్తోంది. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరిప్రసాద్ శర్మ ఆదివారం తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన బాలికలకు ఇంటర్నెట్ సదుపాయం, రీడింగ్ రూమ్, నాణ్యమైన భోజనంతో పాటు వసతిని ఉచితంగా కల్పిస్తామన్నారు. ఆధ్యాత్మిక చింతన, సంప్రదాయాల పట్ల శ్రద్ధ కలిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 97016 09689లో సంప్రదించాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం బస్తాలు ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

ధర్మవరం అర్బన్: అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఆ విభాగం సీఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరంలోని ఎర్రగుంట సర్కిల్‌లో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఐచర్ వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న 172 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. బియ్యం బస్తాలను సీజ్ చేశారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి సీఎస్‌డీటీ లక్ష్మీదేవికి అప్పగించారు. నిందితులు రమేష్ నాయక్, బోయ నర్సింహులు, కిరణ్‌కుమార్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు.

ఇది పాలేగాళ్ల అడ్డా



కుందుర్పి కోట



కోటపై ఉన్న కల్యాణమంటపం



వ్యాయామ శాలను పరిశీలిస్తున్న పర్యాటకులు

- నేటికీ చెక్కు చెదరని కోట గోడలు
- సముద్ర మట్టానికి 3వేల అడుగుల ఎత్తులో కోట నిర్మాణం
- కోటలో పది నీటి కొలనులు
- కరువు కాటకాల్లోనూ సమృద్ధిగా నీరు

కళ్యాణదుర్గం/కుందుర్పి: శతాబ్దాల నాటి రాచరిక చరిత్రకు ఆనవాళ్లుగా జిల్లాలో నేటికీ ఎన్నో సాక్ష్యాలు సజీవంగా కనిపిస్తున్నాయి. ఇందులో అరుదైన దుర్గంగా ఖ్యాతి గడించింది కుసుమగిరి! చారిత్రక ఆనవాళ్లను బట్టి 1652లో కుసుమగిరిని కేంద్రంగా చేసుకుని ఈ ప్రాంతాన్ని పాలేగాళ్లు పాలించినట్లు తెలుస్తోంది. రాజులు పోయారు... రాజ్యాలూ పోయాయి. అయినా వారి పాలనకు గుర్తుగా కోటలు నేటికీ చెక్కుచెదరలేదు. నాడు కుసుమగిరిగా ఖ్యాతిగాంచిన పాలేగాళ్ల దుర్గం కాస్త కాలక్రమేణ కుందుర్పిగా మారింది. అత్యంత చరిత్ర కలిగిన కుందుర్పి దుర్గంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

300 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో..

కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పిలోని కొండకు ఘన చరిత్ర ఉంది. సముద్రమట్టానికి 3వేల అడుగుల ఎత్తులో కొండపై శత్రుదుర్భేద్యమైన కోట గోడలతో అత్యంత సుందరంగా ఈ కోటను అప్పట్లో పాలేగాళ్లు నిర్మించారు. జిల్లా కేంద్రం నుంచి 92 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కోటను చూసి వచ్చేందుకు బస్సు సౌకర్యం ఉంది. దాదాపు 300 ఎకరాలకు పైగా విస్తీర్ణమున్న కొండపై ఉన్న కోట శిఖరాగ్రంలో సింహాసన మంటపం, వ్యాయామశాల, కల్యాణ మంటపం, అక్కాచెల్లెమ్మల కొలను, రామలక్ష్మణ దొన, గన్నేరు దొన, గజ్జెల దొన, గండిపడిన దొన.. తదితర పదికి పైగా కొలనులు ఉన్నాయి. ఎంతటి కరువు కాటకాలు సంభవించినా ఈ కొలనుల్లో నీరు మాత్రం ఇంకి పోకుండా ఉండడం ఇక్కడి ప్రత్యేకతగా చరిత్ర పరిశోధకులు అంటున్నారు. ఈ కొలనుల వల్లనే కుందుర్పి చుట్టుపక్కల బోరుబావుల్లో నీటి మట్టం స్థిరంగా ఉంటోందని, దీంతో ఈ ప్రాంతం పాడిపంటలతో విరాజిల్లుతోందని పేర్కొంటున్నారు. దీంతో ఈ కొలనుల్లో నీటిని స్థానికులు అత్యంత పవిత్ర జలంగా భావిస్తుంటారు.

భక్తుల కొంగు బంగారంగా..

16వ శతాబ్దంలో కుసుమగిరిపై కోనేటిరాయుడు అనే రాజు గ్రామదేవత కుందుర్పమ్మను ప్రతిష్ఠించి, పూజించినట్లు చరిత్ర చెబుతోంది. దీంతో కుసుమగిరి కాస్త కుందుర్పమ్మ కొండగా... తర్వాతి కాలంలో గ్రామం సైతం కుందుర్పిగా మారినట్లుగా స్థానికులు చెబుతున్నారు. కొండపై ఉన్న కొలనుల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగినవి అక్కచెల్లెమ్మల దొన. ఏడు మంచాల నులకను నీటిలోకి జారి విడిచినా అక్క కొలను లోతు తెలియదని స్థానికులు చెబుతున్నారు. అక్క కొలను నుంచి చెల్లెమ్మ కొలనుకు మధ్య సొరంగం ఉందని, ఈ కొలనుల మధ్య పరస్పరం నీటి మార్పిడి జరుగుతుంటోందని చరిత్ర పరిశోధకులు నిర్ధారించారు. ఈ కొలనుల వద్ద గంగ పూజ చేస్తే అవివాహితులకు పెళ్లి అవుతుందని, సంతానం లేని వారికి బిడ్డలు పుడతారని ప్రజల విశ్వాసం. దీంతో ఎంతో మంది ఇక్కడ పూజలు చేసేందుకు తరలి వస్తుంటారు.

వందల మందికి జీవనోపాధి..

కుందుర్పి దుర్గంలో సహజ సిద్ధంగా పెరిగిన సీతాఫలం చెట్లు వేల సంఖ్యలో ఉన్నాయి. ఏటా వీటి ఫలసాయం ద్వారా వందలాది కుటుంబాలకు జీవనోపాధి దక్కుతోంది. సీజన్‌లో రెండు నెలల పాటు ఇక్కడి సీతాఫలాలకు జిల్లాలోనే కాక పొరుగున ఉన్న కర్ణాటకలోనూ భారీ డిమాండ్ నెలకొంటోంది. వ్యాపారులు ఇక్కడికే వచ్చి సీతాఫలాలను కొనుగోలు చేసి, కర్ణాటక ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకుంటుంటారు.

ఎలుగుబంట్ల స్థావరమైంది



నేను చిన్నప్పటి నుంచి కుందుర్పమ్మ కొండకు వెళ్తున్నా. ఈ కొండకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. కొండపై కోట అందరినీ ఆకట్టుకుంటుంది. కొలనుల్లో నీరు సమృద్ధిగా ఉంటుంది. పురాతన చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉన్న ఈ కొండ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఎలుగబంట్లు స్థావరంగా మార్చుకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. కుందుర్పమ్మ కొండను పర్యాటకంగా తీర్చిదిద్దాలి.

– ఎ.కృష్ణమూర్తి, స్థానిక రైతు, కుందుర్పి

ఎంతో చరిత్రాత్మకమైంది



కుందుర్పి కొండకు ఎంతో చరిత్రత్మకమైన ప్రాముఖ్యత ఉంది. అరుణాచలంలో గిరిప్రదక్షిణ చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుందో కుందుర్పమ్మ కొండ చుట్టూ ప్రదక్షిణ చేసినా అంతే పుణ్యఫలం దక్కుతుంది. అత్యంత బలమైన దైవశక్తి ఈ కొండలో దాగి ఉంది. అందుకే ఎంతటి కరువు కాటకాలు సంభవించినా కొండపై కొలనుల్లో నీరు ఇంకిపోలేదు. ఈ కొండను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సత్యనారాయణ శాస్త్రి, ఆలయాల ధర్మకర్త, కుందుర్పి

డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై చర్యలకు రంగం సిద్ధం

- నేడు కలెక్టర్ గౌతమి దృష్టికి విచారణ నివేదిక

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై చర్యలకు రంగం సిద్ధమైంది. ధర్మవరం మండలం చిగిచెర్లకు చెందిన గర్భిణి కవిత(25)కు అబార్షన్ చేసి, మృతికి కారకురాలైందంటూ ఆమె కుటుంబసభ్యులు ఇచ్చిన స్టేట్‌మెంట్, అనుమతుల్లేకుండా ప్రైవేట్ క్లినిక్ నిర్వహణతో పాటు చట్టవిరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేపట్టడం తదితర అంశాలపై న్యాయపరమైన చిక్కులను ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు విస్తృతంగా చర్చించినట్లు తెలిసింది. అనంతరం తుది నివేదికను సిద్ధం చేశారు. ఈ నివేదికను సోమవారం ఉదయం కలెక్టర్ గౌతమికి అందజేయనున్నారు.

కల్లూరు సుబ్బారావు పురస్కారాలకు ముగ్గురి ఎంపిక

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలోని లలిత కళా పరిషత్ (ఎల్కేపీ) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అందించే కల్లూరు సుబ్బారావు అవార్డులకు ఈ ఏడాది వేర్వేరు ప్రాంతాలకు చెందిన కళాకారులు, సాహితీవేత్తలను ఎంపిక చేశారు. వివరాలను ఆదివారం లలితకళాపరిషత్తు అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పద్మజ వెల్లడించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, రాయలసీమకే తలమానికంగా నిలిచిన మహనీయుడు కల్లూరు సుబ్బారావు పేరిట ఇచ్చే అవార్డులను ఈ ఏడాది జిల్లాకే పరిమితం చేయకుండా రాయలసీమ పరిధికి విస్తరించినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో అనంతకు చెందిన చిత్రకారుడు, కవి ఆర్‌వీ ప్రసాద్‌తో పాటు అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన ప్రముఖ సాహితీవేత్త టీఎస్ఏ కృష్ణమూర్తి, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన ప్రసిద్ధ బాలసాహిత్య రచయిత కల్లూరు రాఘవేంద్రరావును అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి ఈ నెల 25న పురస్కార ప్రదానోత్సవంలో ఘనంగా సన్మానించి, అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తగదు

- డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం క్రైం: హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకుండా సంఘంలో ఒకరిగా కలుపుకోవాలని ప్రజలకు డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ క్యాండిలైట్ మెమోరియల్ డేని పురస్కరించుకుని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిశ్శబ్ద కొవ్వొత్తుల ర్యాలీని ఆదివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. హెచ్‌ఐవీతో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుని, ప్రస్తుతం హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారి పట్ల ఆదరణ కలిగి ఉండాలని, వారి హక్కులు, కొత్తగా హెచ్‌ఐవీ ఎవరికి సోకకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఏటా మే మూడో ఆదివారం క్యాండిల్ డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, ఏడీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరప్ప, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ అధ్యక్షుడు వీరాంజినేయులు, సూపర్‌వైజర్ రమణ, హెచ్‌ఐవీ బాధితులు పాల్గొన్నారు.

యాంత్రిక జీవనంతోనే దుష్పరిణామాలు

- కృత్రిమ గర్భధారణ స్పెషలిస్టు డాక్టర్ మహేష్ కొరగాల్



సీఎంఈ కార్యక్రమానికి హాజరైన గైనకాలజిస్టులతో డాక్టర్ మహేష్ కొరగాల్, డాక్టర్ కృష్ణశశి

అనంతపురం క్రైం: ఆహారపు అలవాట్లు, జీవనశైలి మారడం వల్ల ప్రతి ఒక్కరూ యంత్రాలపై ఆధారపడ్డారని, దీంతో దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తోందని నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ సెంటర్ డైరెక్టర్, కృత్రిమ గర్భధారణ స్పెషలిస్టు డాక్టర్ మహేష్ కొరగాల్ అన్నారు. నగరంలోని గైనకాలజిస్టులు డాక్టర్ అరుణ, డాక్టర్ కృష్ణశశి తదితరుల ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణపై నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఇతర జబ్బులతో పాటు సంతానలేమి సమస్య కూడా తీవ్రంగా మారిందన్నారు. దీనికంతటకూ యాంత్రిక జీవనమే కారణమన్నారు. వైద్య రంగంలో వచ్చిన అత్యాధునిక పద్ధతులతో సంతాన సాఫల్యత వీలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. టెస్ట్‌ట్యూబ్ బేబీ, ఐఈఎస్ఐ, నూతన పరికరాలు, అండాశయం నుంచి అండాల సేకరణ, వాటి ఫలదీకరణ, ఫలదీకరణ చెందిన అండాలను గర్భసంచిలో ప్రవేశపెట్టడం, తదితర వివరాలను ఆయన వివరించారు. గర్భసంచి మార్పిడి, రోబొటిక్ యంత్రాల సత్ఫలితాలు, సరోగసి వల్ల ఎదురయ్యే న్యాయపరమైన చిక్కులు, నూతన ఏఆర్టీ బిల్లు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విశ్రాంత సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ కృష్ణశశి మాట్లాడుతూ... నిరంతర వైద్య విద్య ద్వారా నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ తరహా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ జీజీహెచ్ గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సంధ్య, గైనకాలజిస్టులు డాక్టర్ రేణుక, డాక్టర్ నిస్సీవినూత్న, డాక్టర్ సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

టీ తాగుతూ కుప్పకూలి వ్యక్తి మృతి



మృతుడు రామిరెడ్డి

గుత్తి: స్థానిక బస్టాండ్ ఆవరణలోని ఓ హోటల్‌లో టీ తాగుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడిని పెద్దవడుగూరు మండలం జి.వెంకటాంపల్లి నివాసి రామిరెడ్డి (61)గా గుర్తించారు. వ్యక్తిగత పనిపై ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై గుత్తికి వచ్చిన ఆయన మధ్యాహ్నం 2.30 గంటలకు బస్టాండ్ ఆవరణలోని హోటల్‌లో టీ తాగుతూ ఉన్నఫళంగా కుప్పకూలాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి...

హిందూపురం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ.బాలాజీ నాయక్ తెలిపిన మేరకు.. మృతుడికి 35 సంవత్సరాల లోపు వయస్సుటుంది. బిహారీ వలస కార్మికుడిగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. రైలు ఢీకొనడంతో ఆనవాళ్లు చిక్కనంతగా మృతదేహం నుజ్జునుజ్జైంది. సంబంధీకులు ఎవరైనా ఉంటే హిందూపురం రైల్వే పోలీసులను సంప్రదించవచ్చు.

వివాహిత బలవన్మరణం



కళ్యాణి (ఫైల్)

పరిగి: మూర్ఛ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం గోనిమేకలపల్లికి చెందిన కిష్టప్ప కుమార్తె కళ్యాణి (34)కి పరిగి మండలం శ్రీరంగరాజుపల్లికి చెందిన ఉప్పర గోపాల్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. కొంత కాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్ఐ నరేంద్ర ఆదివారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతురాలి తండ్రి కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

బత్తలపల్లి: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన బెస్త చిన్న ఆదినారాయణ (45) ఆదివారం ఉదయం కట్టకిందపల్లి చెరువు వద్ద నుంచి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి జీవితంపై విరక్తితో చనిపోవాలనుకుని తాను ఊజీ మాత్రలు మింగినట్లు తెలిపాడు. దీంతో ఆగమేఘాలపై భార్య యశోదమ్మ, కుమారుడు నరేష్ అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న నారాయణను వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. కాగా, మృతుడు ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుని వచ్చినట్లు సమాచారం. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, నారాయణ మృతికి కారణలపై అన్వేషిస్తున్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గార్లదిన్నె: రైతుల పొలాల్లోని బోరుబావుల్లో ఉన్న సబ్‌మెర్సిబుల్ మోటార్లను అపహరించుకెళ్లే ఇద్దరిని గార్లదిన్నె పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్ఐ సాగర్ వెల్లడించారు. ఇటీవల గార్లదిన్నె మండలం యర్రగుంట్ల, కల్లూరు గ్రామాల్లో వ్యవసాయ మోటార్లను అపహరించుకెళ్లినట్లుగా బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఆదివారం ఉదయం 44వ జాతీయ రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక కల్లూరుకు చెందిన పసల ఓబులనాయుడు, సంజీవపురం నివాసి శంకర సాయికుమార్ అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో వ్యవసాయ మోటార్ల దొంగతనం వెలుగులోకి వచ్చింది. నిందితుల నుంచి ఒకటి మోనో బ్లాక్ మోటార్, మరొక సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

భర్త రెండో పెళ్లిని అడ్డుకున్న భార్య



బాధితురాలు శిరీష

గుత్తి: భర్త రెండో పెళ్లిని మొదటి భార్య అడ్డుకున్న ఘటన గుత్తిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన సుభాష్‌కు గుత్తికి చెందిన ఓ యువతితో పెళ్లి నిశ్చయమైంది. ఆదివారం గుత్తిలో పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేశారు. అరగంటలో పెళ్లి తంతు ముగుస్తుందనుకుంటుండగా మొదటి భార్య శిరీష అక్కడకు చేరుకుంది. 2020, ఆగస్టు 18న తమకు వివాహమైందంటూ తగిన ఆధారాలు చూపడంతో చివరి క్షణంలో పెళ్లి తంతు కాస్త ఆగిపోయింది. ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు వరుడిని గుత్తి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కాగా, సుభాష్, శిరీష ఇద్దరూ హైదరాబాద్‌కు చెందిన వారు కావడంతో కేసును అక్కడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.



అ'పూర్వ' సమ్మేళనం

రాయదుర్గం: స్థానిక కణేకల్లు రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆదివారం పూర్వ విద్యార్థుల సందడితో మురిసింది. 1989–1990 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది అంతా ఒక్కటిగా కలిశారు. వృత్తి రీత్యా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్థిరపడ్డ వారంతా బాల్య మిత్రులను కలుసుకునేందుకు తరలివచ్చారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఊరేగింపుగా వేదికపైకి తీసుకెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాటి గురువు.. ప్రస్తుతం శ్రీకాకుళంలో ఆర్డీఓగా పనిచేస్తున్న కేఎస్ రామారావు మాట్లాడుతూ.. తాను చదువుకున్న ఈ పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. ఈ ఆత్మీయ కలయిక తన మధుర క్షణాలను తట్టి లేపిందంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

ముదిగుబ్బ: మండలంలోని దొరిగిల్లు సమీపంలో బ్రిడ్జి వద్ద ఆదివారం ప్రమాదవశాత్తు పెద్దయ్య (30) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరుకు చెందిన పెద్దయ్య ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లికి చెందిన పావనిని పెళ్లి చేసుకున్నాడు. అక్కడే కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పావని ప్రస్తుతం గర్భవతి. సొంత ఊరికి వెళ్లి వస్తానని ఆదివారం ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని దొరిగిల్లు బ్రిడ్జిపై సేద తీరేందుకు కూర్చొన్న అతను అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని అటుగా వెళ్తున్న గమనించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

సంతల ద్వారా రూ.3.43 లక్షల ఆదాయం



ఆదివారం మార్కెట్‌యార్డులో సంతకు వచ్చిన ఎద్దులు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.43 లక్షలకు పైచిలుకు ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్, ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,01,570 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,42,390 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాప్తాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మజాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 22 నుంచి జూన్ 7 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200 దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు.

కాలసర్పదోష నివారణ పూజలు



ప్రత్యేక అలంకరణలో సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు : పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచామృతాభిషేకాలు, కుజ దోష, కాల సర్పదోష నివారణకు ప్రత్యేక పూజలు, రాహుకేతు హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామికి సుబ్రహ్మణేయశ్వర మూలమంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. అనంతరం ఆకుపూజ, పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

కావాలనే పైపులైన్ ధ్వంసం చేశారు



పైప్‌లైన్‌లను మరమ్మతు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: వేపచెర్ల గ్రామంలో ఎంపీపీ హేమలత గ్రామస్తులతో మాట్లాడి, నీటి సమస్య పరిష్కరించారు. బోరు మరమ్మతు చేయించి, పైప్ లైన్ చేయించారు. కానీ గుర్తు తెలియని వ్యక్తులు బోరు నుంచి గ్రామంలోకి వచ్చే పైప్‌లైన్లను ధ్వంసం చేశారు. దీంతో ఆదివారం సర్పంచ్ లక్ష్మీదేవి, కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు పైపులను ఏర్పాటు చేసుకున్నారు. దురుద్దేశంతో కొందరు నీటి ఎద్దడిని సృష్టిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందని కమిషనర్ రమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు సమస్యలను వినతుల రూపంలో అందించొచ్చన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని, 108 సాలగ్రామ శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

•వినోదం.. వికాసం.. విజ్ఞానం!



వేసవి సెలవులు కావడంతో విద్యార్థులతో కిటకిటలాడుతున్న పీటీసీ క్రీడామైదానం

విద్యాసంవత్సరం పూర్తయ్యింది.. విద్యార్థులకు పాఠశాలలు ముగిసిన తర్వాత వేసవి సెలవులు ఆటవిడుపు అయ్యాయి.. ఆనందాన్ని పంచుతున్నాయి.. నగరంలోని పలు ప్రాంతాల్లోని క్రీడా మైదానాలు సందడిగా మారాయి. సమ్మర్ క్యాంపుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆర్డీటీ ఆధ్వర్యంలో వినోదం..వికాసం.. విజ్ఞానం అందిస్తున్నారు. అందులో విద్యార్థులు పాల్గొని అదనపు నైపుణ్యం పెంచుకోవచ్చు. సరదాగా స్విమ్మింగ్, స్కేటింగ్ చేయొచ్చు.. హాకీ, ఆర్చరీ, కబడ్డీ ఆడొచ్చు.. నృత్యం నేర్చుకోవచ్చు.. బ్యాటింగ్‌లో మెలకువలు తెలుసుకోవచ్చు. కేవలం ఆసక్తి ఉంటే చాలు.. అన్నింట్లో రాణించొచ్చు. అందుకు తల్లిదండ్రులు కూడా విద్యార్థులనుక్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఆర్డీటీ స్టేడియంలో క్రీడాకారుల సందడి



ఆర్డీటీ స్టేడియంలో ఆర్చరీలో సాధన చేస్తున్న చిన్నారులు



ఆర్డీటీ క్రీడా గ్రామంలో హాకీ ఆడుతున్న చిన్నారులు

ఆట విడుపు



కబడ్డీ ఆడుతున్న బాలురు



క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు



మారుతీనగర్‌లో స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

కుక్కల సంతానోత్పత్తి తగ్గించేందుకు చర్యలు

అనంతపురం క్రైం: నగరంలోని పలు ప్రాంతాల్లో నగరపాలక వర్గం కుక్కల సంతానోత్పత్తి తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు కుక్కల బెడద సమస్యను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దృష్టి తీసుకొచ్చారు. దీంతో ఆయన ఆదేశాలతో సత్వర పరిష్కారం చూపేందుకు నగర పాలక సంస్థ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కుక్కలు పట్టి, వాటికి స్టెరిలైజేషన్ చేసేందుకు కాకినాడకు చెందిన ఎస్ఎన్ఏపీ సొసైటీ ఫర్ నేచర్ అండ్ అనిమల్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి నగరపాలక సంస్థ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ కింద కాంట్రాక్ట్ అప్పగించింది.

కుక్కకు స్టెరిలైజ్ చేస్తే రూ.1,350

కుక్కను పట్టుకుని స్టెరిలైజేషన్ చేస్తే ఒక్కో కుక్కకు రూ.1,350 చెల్లించేలా నగరపాలక సంస్థ అధికారులు సదరు ఏజెన్సీతో ఒప్పందం చేసుకున్నారు. కుక్కలు పట్టేందుకు వాహనాలు, సిబ్బంది, వెటర్నిటీ వైద్యులను సదరు ఏజెన్సీ ఏర్పాటు చేసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. నగరపాలక సంస్థ అధికారులు కంపోస్టు యార్డులో కుక్కల స్టెరిలైజేషన్ చేసేందుకు ఓ షెడ్డు ఏర్పాటు చేశారు. అందులో 77 కెన్నల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆపరేషన్, స్టెరిలైజేషన్‌కు సంబంధించి సాధనాలు (ఇన్‌స్ట్రుమెంట్స్) నగరపాలక సంస్థ అధికారులు సమకూర్చనున్నారు. ఇప్పటికే రూ.5,54,000 (రూ.5.54 లక్షలు)లతో 60 రకాల సాధనాలు కొనుగోలు చేసేందుకు టెండర్‌ను పూర్తి చేశారు. కుక్కల బెడద తగ్గిం చేందుకు సాధ్యమైనంత త్వరగా స్టెరిలైజేషన్ ప్రక్రియను ప్రారంభించేందుకు కమిషనర్ రమణారెడ్డి చర్యలకు ఆదేశించారు. త్వరితగతిన ఆచరణలోకి తీసుకువచ్చేందుకు ఎంహెచ్ఓ డాక్టర్ గంగాదర్ రెడ్డి, తదితర అధికారులు కంపోస్టు యార్డులోని షెడ్డును పూర్తిస్థాయిలో సిద్ధం చేసేందుకు చర్యలకు ఉపక్రమించారు.



కంపోస్టు యార్డు వద్ద ఉన్న షెడ్డులో కుక్కలకు స్టెరిలైజేషన్ కోసం ఏర్పాటు చేసిన కెన్నల్స్

వేసవి శిబిరంలో ఆధ్యాత్మిక తరగతులు

అనంతపురం కల్చరల్: స్థానిక అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయ కళా ప్రాంగణంలో సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వేసవి శిబిరం నడుస్తోంది. హరిఃఓం ఆధ్యాత్మిక వేదిక తరఫున అనంత పద్మనాభయ్య అనే ప్రైవేట్ ఉపాధ్యాయుడు చిన్నారులకు ఆధ్యాత్మిక శిక్షణ ఇస్తున్నారు. రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిబిరంలో సనాతన ధర్మాన్ని ప్రతిబింబించే శ్లోకాలు నేర్పిస్తున్నారు.

ఏమేమి నేర్పుతున్నారంటే...

విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంచేందుకు విష్ణు సహస్ర నామాలు నేర్పిస్తున్నారు. విష్ణుసహస్ర నామ పారాయణంలోని 108 శ్లోకాల్లో రోజూ పదింటిని విద్యార్థులు రాగయుక్తంగా ఆలపించేలా నేర్పిస్తున్నారు. గణపతిస్తోత్రం, నవగ్రహస్తోత్రం, లక్ష్మీ అష్టోత్తరం, ఆదిత్యహృదయం తదితర కఠినమైన శ్లోకాలు విద్యార్థులు అవలీలగా చెప్పేస్తున్నారు. అనంత పద్మనాభయ్య మాట్లాడుతూ మనదేశ ధర్మంపై ఉచిత బోధన చేస్తామని, రోజూ కనీసం గంట పాటైనా ఇతర విద్యలతో పాటు నైతిన విలువలు, క్రమశిక్షణ పెంచేలా సాధన చేయిస్తున్నట్లు తెలిపారు. వేసవి శిబిరంలో ఆధ్యాత్మిక వేత్తలు, స్వామీజీలు పిల్లలను ఆధ్యాత్మిక పాఠాలు చెప్తున్నారన్నారు. దాతల ద్వారా చిన్నారులకు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు.



ఆధ్యాత్మిక శిబిరంలో చిన్నారులు

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

అనంతపురం కల్చరల్: భక్తిమార్గంతో ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని వ్యాసరాజ మఠం పీఠాధిపతులు శ్రీవిద్యశ్రీస స్వామీజీ ఉద్బోధించారు. ఆదివారం విశ్వ మధ్వ మహాపరిషత్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వటువులకు సామూహిక ధర్మోపనయనాలు శాస్త్రోక్తంగా సాగినాయి. స్థానిక పాతూరులోని ఉత్తరాధిమఠం ప్రాంగణంలోని మూలాంజనేయస్వామి ఆలయంలో ఎనిమిది మంది వటువులకు ఉచిత ఉపనయనాలు జరిపించారు. విశిష్ట అతిథులుగా కర్ణాటక రాష్ట్రం సోసలే నుంచి విచ్చేసిన వ్యాసరాజమఠం పీఠాధిపతులు శ్రీవిద్యాశ్రీస స్వామీజీ వటువులను ఆశీర్వదించి, అనుగ్రహ భాషణం చేశారు. అంతకు ముందు మూలాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ పాతూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ వినోదాచార్, సీనియర్ న్యాయవాది ఏఎస్ గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అనుగ్రహభాషణం చేస్తున్న వ్యాసరాజమఠం పీఠాధిపతులు

గాలీవాన బీభత్సంతో పంటల నష్టం



గాలీవానకు నేలకూలిన బొప్పాయి చెట్లు



మరూరులో కింద పడిపోయిన విద్యుత్ పోలు

రాప్తాడు: మండలంలో ఆదివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. దీంతో మండల వ్యాప్తంగా విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. చాపట్ల గ్రామంలో దాదాపుగా 6 విత్యుత్ స్తంభాలు, 30 చెట్లు, మరూరు గ్రామంలో 4 విద్యుత్ స్తంభాలు, 20 చెట్లు, బోగినేపల్లిలో 3 విద్యుత్ స్తంభాలు, 30 చెట్లు నెలకొరిగాయి. మండలంలో వివిధ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి.

ఆత్మకూరు: గొరిదిండ్ల వద్ద ఆదివారం కురిసిన గాలీవానకు కల్యాణదుర్గం మండలం బాలవెంకటాపురానికి చెందిన రవూఫ్ అనే రైతుకు చెందిన బొప్పాయి చెట్లు నేలకూలాయి. ఐదు ఎకరాల్లో బొప్పాయి పంట సాగు చేశానని, పూత దశలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రెండెకరాలకు పైగా బొప్పాయి చెట్లు నేలకూలాయని బాధితుడు తెలిపాడు.



మరూరులో నేలకొరిగిన చెట్లు

ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి తోటలు

కనగానపల్లి: మండలంలోని బద్దలాపురం, యలకుంట్ల గ్రామాల్లో ఈదురు గాలులతో అరటి తోటలు నేలకొరిగాయి. దీంతో రూ.లక్షల్లో పంట నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు. మండలంలోని పలుచోట్ల శనివారం రాత్రి ఈదురు గాలులతో పాటు వర్షం కురిసింది. వీటి వల్ల బద్దలాపురం గ్రామంలోని చంద్రాయుడు, అమృతమ్మ, చిన్నికృష్ణారెడ్డి, నవీన్‌రెడ్డి రైతులకు చెందిన 23 ఎకరాల్లోని అరటి తోటలు నేలకొరిగాయి. దీంతో సుమారు రూ. 25 లక్షల దాకా పంట నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు. వీటితో పాటు యలకుంట్ల, నెమలివరం గ్రామాల్లో కూడా పలుచోట్ల అరటి తోటలు దెబ్బతిన్నాయని స్థానిక రైతులు తెలిపారు. పంటలను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నాయకులు: ఈదురు గాలులతో దెబ్బ తిన్న అరటి తోటలను స్థానిక హార్టికల్చర్ అధికారులతో కలసి మండల అగ్రీబోర్డు చైర్మన్ వెంకటరాముడు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపి, బాధిత రైతులకు పంట నష్ట పరిహారం వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, గంగుల సుధీర్ రెడ్డి, వీహెచ్‌పీ ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.



బద్దలాపురం నేలకొరిగిన అరటి తోటను పరిశీలిస్తున్న దృశ్యం

పామిడమ్మకు ప్రత్యేక పూజలు

పామిడి: పామిడమ్మ ఆలయంలో ఆదివారం ఉత్సవ విగ్రహ చర ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దుస్తకర్ పవన్, రవి సౌజన్యంతో రూ.లక్ష వ్యయంతో తయారు చేయించిన ఈ ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలో అందజేశారు. ఈసందర్భంగా వేదపండితులు కలశస్థాపన, గణపతి పూజ, నవగ్రహ, వాస్తు, దుర్గహోమాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యిమందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాటిల్ శ్రీనాథ్‌రెడ్డి, కవి నారాయణమూర్తి, నాగూరు పాపిరెడ్డి, బొల్లు వెంకట్రామిరెడ్డి, మస్తానయ్య, రంగనాయకులు, రాజు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వ్యక్తిపై కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక ఫెర్రర్ కాలనీకి చెందిన వరప్రసాద్ అలియాస్ వరాలు అనే చీటర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి ఆదివారం తెలిపారు. తపోవనానికి చెందిన శివమ్మ అనే మహిళకు ఇంటి స్థలం ఇప్పిస్తానని చెప్పి రూ. 2 లక్షలు తీసుకున్నాడు. సంబంధం లేని స్థలాన్ని ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. తీరా స్థలం అతనిది కాదని తెలియడంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. రూ. 2 లక్షలు తీసుకొని మహిళను మోసగించిన నేరం కింద అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆశ్రమ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి టౌన్: తల్లిదండ్రులు లేదా తల్లి లేక తండ్రి లేని అనాథ బాలుర ఆశ్రమ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తాడిపత్రి బాలకల్యాణ ఆశ్రమ గౌరవాధ్యక్షుడు చిన్నారావు, అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి లక్ష్మీనరసింహ ఓ ప్రకటనలో కోరారు. ఐదేళ్లు నిండిన బాలురు మాత్రమే అర్హులని, ఆశ్రమంలో ఆశ్రయం, వ్యాయామం, నైతిక విలువలతో కూడిన విద్య బోధించనున్నట్లు పేర్కొన్నారు. సౌభాగ్యసింధూ ట్రస్ట్ పేరుతో దాతల సహాయ సహకారాలతో ఆశ్రమ నిర్వాహణ జరుగుతున్నట్లు తెలిపారు. పప్పూరు రోడ్డులోని మోడల్ స్కూలు సమీపంలో అనాథ బాలుర ఆశ్రమ నిర్మాణం జరుగుతుంద న్నారు. వివరాలకు 9908746900, 8919278039లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డుపై చెత్తాచెదారం ఉంచొద్దు

అనంతపురం క్రైం: రోడ్డుపై చెత్త కనిపించకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి పారిశుధ్య కార్యదర్శులను ఆదేశించారు. ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించాలన్నారు. క్లాప్ ఆటోల ద్వారా సేకరిస్తున్న చెత్తను కచ్చితంగా వేరు చేసి తీసుకెళ్లాలన్నారు. అనంతరం కంపోస్టు యార్డును కమిషనర్ పరిశీలించారు.

జనసేన నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేయండి



డీఎస్పీ ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పరుష పదజాలంతో దూషించిన జనసేన పార్టీ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వైఎస్‌ఆర్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బిందెల శ్రీదేవి కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక డీఎస్పీ ప్రసాద్‌రెడ్డిని కలిసి జనసేన పార్టీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17న జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాయవాది కుంటిమద్ది జయరామిరెడ్డి, మరో ఇద్దరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వారు చేసిన వ్యాఖ్యలతో ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. బాధ్యతాయుతమైన న్యాయవాద వృత్తిలో ఉండి కూడా ఇలా మాట్లాడడం సరికాదన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జనసేన పార్టీ నాయకులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ శివరాముడు తెలిపారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బిందెల శ్రీదేవి, నాయకురాళ్లతో కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యాఖ్యలు, కార్యకలాపాలు కొనసాగిస్తున్న జనసేన పార్టీకి చెందిన నాయకులు, న్యాయవాది జయరామిరెడ్డితో పాటు మురళీ, విజయ్ కుమార్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

23న 'వలంటీర్లకు వందనం'

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 23న 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఆయన చేతులమీదుగా వలంటీర్లకు సేవా వజ్ర, సేవ రత్న, సేవమిత్ర పురస్కారాలతో పాటు ప్రశంశా పత్రాలు, మెడల్స్, బ్యాడ్జీ, సత్కరిస్తారన్నారు.

కాలనీలన్నీ కలియదిరిగిన పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక త్రీటౌన్ పోలీసులు పలు కాలనీల్లో సోదాలు, వాహనాల తనిఖీ చేశారు. ఆదివారం నగరంలోని బళ్లారి బైపాస్ కూడలిలో వాహనాలు తనిఖీ చేశారు. అనుమానిత ప్రాంతాల్లో సోదాలు చేశారు. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మట్కా, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలకు ఉమ్మడి జిల్లా వాసులేకాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి కానుకలు సమర్పించారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఏపీఓ శ్రీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24కి గాను ఉపాధి హామీ కింద మామిడి, సపోట, జామ, నిమ్మ, దానిమ్మ, నేరేడు, సీతాఫలం, అంజూర, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకం కల్పిస్తోందని పేర్కొన్నారు. జాబ్ కార్డుకు 5 ఎకరాల లోపు పొలం ఉండాలని, ఉద్యాన తోటల నిర్వహణ కోసం ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందని తెలిపారు. వివరాలకు ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని కుంటలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మేరకు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.3,870 నగదు స్వాధీనం చేసుకున్నారు.